క్లుప్తంగా

పిల్లల చదువుపై శ్రద్ధ తీసుకోండి



చిన్నారితో సమాధానాలు రాబడుతున్న ఎంఈఓ మోహన్

రొళ్ల: తల్లిదండ్రులు పిల్లల చదువుపై శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ–1 మోహన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక, ఎస్సీ కాలనీ, మారుతీకాలనీ ప్రాథమిక పాఠశాలతో పాటు బాలాజీ రూరల్ అప్పర్ ప్రైమరీ ప్రైవేట్ పాఠశాలను ఎంఈఓ–1 మోహన్ సందర్శించారు. ఆయా పాఠశాలలో రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెను ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని తయారు చేసి వడ్డించాలన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లి గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

విద్యార్థి చికిత్సకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులను నగదు అందజేస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని చిన్నకోడిపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి రాము ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబం కావడంతో బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు చికిత్స నిమితం వైద్య ఖర్చులకు విద్యార్థికి రూ 25,500 ఆర్థిక సాయం అందించారు.

వ్యక్తికి గాయాలు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని సాయినగర్ వద్ద బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనగా ఈడిగ మారుతీకి గాయాలయ్యాయి. అతన్ని చికిత్సకోసం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం




ఉద్యోగులను సన్మానించిన దృశ్యం

సోమందేపల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు పొందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను బుధవారం ఆల్ ఇండియా బంజారా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాగినాయని చెరువు తండాలో సన్మానించారు. తహసీల్దార్ సురేష్‌కుమార్ , సర్పంచులు అంజి నాయక్, గంగాదేవి, ఎస్ఐ విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ వెంకటనాయక్, విక్రాంత్, విశ్వనాథ్ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగళి: మండలంలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ జమానుల్లాఖాన్ , లైన్‌మెన్ ఉమాపతి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దార్, లైన్‌మెన్‌లను సన్మానించడంతో పాటు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దరాజు, నాయకులు కామరాజు, సతీష్, బసవరాజు, ఈరన్న పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న సీతారామమ్మ

పరిగి: పట్టు పరిశ్రమ తోడ్పాటుకు ప్రభుత్వం అనేక విధాలుగా ప్రోత్సహిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకుని పట్టు రైతులు పంటలను సాగు చేయాలని శాస్త్రవేత్త సీతారామమ్మ తెలిపారు. బుధవారం స్థానిక పట్టు పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రంలో ఆమె పట్టు రైతులకు అవగాహన కల్పించారు.

ప్రతిపక్షాలవి కుట్రలు, కుతంత్రాలు

- ఎమ్మెల్యే శంకర నారాయణ



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ

రొద్దం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆదరించాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. ప్రతిపక్షాలు చేసే కుట్రలు, కుతంత్రాలను, మోసాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని నారనాగేపల్లి పంచాయతీ రాచూరు, జక్కలచెరువు గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర నారాయణ, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆసరా, అమ్మఒడి, రైతు భరోసా, పింఛన్ కానుక, విద్యాదీవెన, వాహన మిత్ర, జగనన్న తోడు, జగనన్న చేదోడు, పావలా వడ్డీ, వడ్డీ మాఫీ తదితర సంక్షేమ పథకాలు అందుతున్నాయా? పథకాలకు ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన నవరత్నాల్లాంటి హామీలు పేద ప్రజల జీవితాల్లో సంక్షేమ కాంతులు నింపుతున్నాయన్నారు. అర్హత ఉంటే చాలు కుల, మత, పార్టీలతో సంబంధం లేకుండా వారికి సంక్షేమ పథకాలు అందేవిధంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రతి ఇంట్లోనూ రెండు మూడు సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందాయని, ఎలాంటి సమస్యలు వచ్చినా సచివాలయంలో తెలియచేస్తే వాటిని సచివాలయ సిబ్బందే పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబాన్ని పలకరిస్తున్నామని, ఏవైనా సమస్యలుంటే అక్కడిక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాలుగేళ్లలో సాధించిన ప్రగతి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ విజన్ 2047 అంటూ మరో 240 వ్యవహారానికి తెరతీశారన్నారు. టీడీపీ శ్రేణులు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

బాధితులకు పరామర్శ

ఇటీవల కోడిపల్లి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థులు జశ్వంత్, ఈశ్వర్‌తో పాటు గాయపడిన విద్యార్థి రాము కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ నాగార్జున, ఎంపీటీసీ పద్మావతి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కలిపి శ్రీనివాసులు, మండల పార్టీ కన్వీనర్ బోయ తిమ్మయ్య, సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి, ముఖ్య నాయకులు నాగేంద్రప్ప, ఎస్.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి, సచివాలయాల సమన్వయకర్త రవిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



ఇన్‌చార్జ్ ఏఈతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొళ్ల: వ్యవసాయ రంగానికి పగటి సమయంలో ఐదు గంటలు, రాత్రి వేళలో రెండు గంటలు చొప్పున విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ ఇన్‌చార్జ్ ఏఈ జబీవుల్లా తెలిపారు. బుధవారం పట్టణంలోని గుడిబండ రోడ్డులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో గుడ్డగుర్కి సర్పంచ్ హరికృష్ణ, కాకి వైస్ సర్పంచ్ రాజు, వైస్ ఎంపీపీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బసవరాజు, లోకేష్, దొమ్మరహట్టి మంజునాథ్ తదితరులు ఏఈ కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రోజుకు నాలుగు, ఐదు గంటలు మాత్రమే అది కూడా నిరంతరంగా కాకుండ రెండు మూడుసార్లు తొలగిస్తూ విద్యుత్ సరఫరా చేస్తున్నారని చెప్పారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. దీనికి స్పందించిన ఇన్‌చార్జ్ ఏఈ స్పందిస్తూ ఇకపై రోజుకు ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకొంటామన్నారు. మండల వ్యాప్తంగా 2800 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్, విద్యుత్‌శాఖ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోండి



గుడిబండ: పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ వీరనరేష్

గుడిబండ: మండలంలోని రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గుణేమోరుబాగల్, ముతుకూరు, రాళ్ళపల్లి పంచాయతీ పరిధిలో పంటనమోదు కార్యక్రమం నిర్వహించారు.

రొళ్ల: మండలంలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్ బుకింగ్ ద్వారా పంట నమోదు చేయాలని ఏఓ రాజ్యలక్ష్మీ కోరారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిధిలోని మల్లినమడుగు సచివాలయం పరిధిలోని వ్యవసాయ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు.

అగళి: మండల పరిధిలోని 11 రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ ఈ పంట నమోదు కార్యక్రమం మొదలైందని, పంట పెట్టిన ప్రతి రైతు పంటను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి పంటల నమోదు చేసుకోని టోకెన్ రశీదు పొందాలన్నారు. నమోదు చేసుకొన్న రైతులకే ప్రభుత్వం నుంచి వచ్చే వైఎస్సార్ బీమా వర్తిస్తుందన్నారు.

ఆర్టీఓకు సన్మానం



ఆర్టీఓ కరుణసాగర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న స్థానిక ఆర్టీఓ కరుణసాగర్‌రెడ్డిని హిందూపురం ప్రైవేటు బస్సు ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీఓను మర్యాద పూర్వకంగా శుభాకాంక్షలను తెలిపారు. బీఎస్‌టీ బస్సు ఓనర్ కాశీ విశ్వనాథ్, ఎస్ఎల్‌వీ వేణుగోపాల్, ఆర్వీజీటీ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోరీని ఢీకొన్న లారీ



సోమందేపల్లి: మండల కేంద్రమైన మణికంఠ కాలనీ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న మోరీని ఓ లారీ ఢీకొంది. బుధవారం రాత్రి కర్ణాటకలోని మంగళూరు వైపు నుంచి కర్నూలు జిల్లా డోన్‌కు వెళుతున్న లారీ టైరు పంక్చర్ అయింది. దీంతో అదుపు తప్పి మణికంఠ కాలనీ వద్ద మోరీని ఢీ కొంది. ఈ ఘటనలో డ్రైవర్ అంజి, క్లీనర్ వీరాంజనేయకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కొద్దిసేపు హైవేపై రాకపోకలకు అంతరాయం కలిగింది.

కొనసాగుతున్న నిరసన

లేపాక్షి: మండలంలోని కొండూరు, సోమిరెడ్డిపల్లి, చిలమత్తూరు మండలంలోని కొర్లకుంట గ్రామాలకు చెందిన రైతులు తమ భూములను తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న నిరసన బుధవారానికి మూడోరోజుకు చేరింది. కుశల ఆర్గానిక్ ప్రొడక్స్ యాజమాన్యం వారు తమ వద్ద అక్రమంగా భూములు లాక్కున్నారని, దీనికి రెవెన్యూ అధికారులు కొమ్ముకాస్తున్నారని వారు ఆరోపించారు. తమ న్యాయం జరిగే వరకు నిరసన కార్యక్రమం కొనసాగిస్తామని తెల్చిచెప్పారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



రాచపల్లిలో ఉపేంద్రరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం టౌన్: మండల పరిధిలోని చలివెందుల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు ఉపేంద్రరెడ్డికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థి ఉపేంద్రరెడ్డి మంచం గుర్తుకు ఓటు వేసి, వేయించి అఖండ మెజార్టీతో గెలిపించాలని వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ ఓటర్లుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండల పరిధిలోని రాచపల్లిలో వారు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వైస్ ఎంపీపీ రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, కొల్లకుంట ఆనంద్‌రెడ్డి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో డీఎస్పీకి..



డీఎస్పీ హుస్సేన్‌పీరాని అభినందిస్తున్న మానవ హక్కుల సంఘం నాయకులు

పెనుకొండ: డీఎస్పీ హుస్సేన్‌పీరాను స్థానిక మానవ హక్కుల సంఘం నాయకులు సన్మానించారు. డీఎస్పీ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకోవడంతో బుధవారం కార్యాలయంలో డీఎస్పీని కలసిన నాయకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రవూఫ్, సిరాజుద్దీన్, న్యాయవాది శివకుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజినేయులు, మాలమహానాడు కన్వీనర్ ఎంఎస్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి మెరిట్ అవార్డు

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.సాజియాకు బీమా గ్రూప్ మెరిట్ అవార్డును ప్రదానం చేశారు. సాజియా గత విద్యాసంవత్సరంలో ఇంటర్ ఫలితాల్లో సీఈసీ విభాగంలో 962 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ డాక్టర్ సిద్దేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆమెకు మెమొంటోతో పాటు నగదు బహుమతి అందించారు.

అందుబాటులో ఎరువులు

హిందూపురం టౌన్: హిందూపురం డివిజన్ పరిధిలోని హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లోని 77 రైతు భరోసా కేంద్రాల్లో రైతుల కోసం ఎరువులను అందుబాటులో ఉంచినట్లు హిందూపురం సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఆర్‌బీకేల్లో డీఏపీ–110.8 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 194 ఎంటీఎస్ యూరియా–405 ఎంటీఎస్, పోటాష్–1.75 ఎంటీఎస్, నానో యూరియా 532 లీటర్లు అందుబాటులో ఉంచామన్నారు.

సరుకుల పంపిణీ పరిశీలన

అమరాపురం: మండలంలోని నిత్యావసర సరుకుల పంపిణీని తహసీల్దార్ రమేష్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో ట్రక్కు ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులు సక్రమంగా ఇస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు.

ఈ–క్రాప్ బుకింగ్‌పై శిక్షణ

లేపాక్షి: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఉదయం ఈ–క్రాప్ బుకింగ్, పంటకోత ప్రయోగం జాయింట్ అజమాయిషీపై వీఆర్‌ఓ, ఏఈఓ, ఆర్‌బీకే సిబ్బందికి వ్యవసాయాధికారి శ్రీలతో, ఏఎస్ఓ వల్లీనాథరావులు శిక్షణ ఇచ్చారు. ఈ–క్రాప్ బుకింగ్ పకడ్బందీగా, పారదర్శకంగా చేయాలన్నారు.

పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

పావగడ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశోధన కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడతానని స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్ అన్నారు. దీనిపై ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్‌తో చర్చిస్తామన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు సభకు ఆయన హాజరయ్యారు.

వాజ్‌పేయి సేవలు వెలకట్టలేనివి

హిందూపురం టౌన్: భారతరత్న, మాజీ ప్రధాని వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివని బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం వాజ్‌పేయ్ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్‌లో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. నాయకులు పార్థసారథి, ఆదర్శ్, వరప్రసాద్, టీకే బాబు, శంకర్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూములను స్వాధీనం చేసుకోవాలి

చిలమత్తూరు: మండలంలోని కోడూరు, కొడికొండ పంచాయతీల్లో బెంగళూరు వాసి రెడ్డప్పశెట్టి అనే వ్యక్తి 200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారు. ఆ భూములను అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని' అని కోరుతూ సీపీఐ నాయకులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు నిరసన తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

రొళ్ల: రొళ్ల వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో గత ఏడాది పంట రుణాలు పొందిన రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకుంటే వడ్డీ భారం తగ్గుతుందని సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్ తెలిపారు.

పర్యావరణంతోనే మానవ మనుగడ

పెనుకొండ: పర్యావరణంతోనే మానవ మనుగడ సాధ్యమని ఎస్‌బీఐ మేనేజర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పెనుకొండ: పట్టణంలోని ఆల్విన్ కాలనీకి చెందిన రవీంద్రనాయక్ కుమారుడు డేనియల్ నాయక్‌కు కర్నూలు విశ్వభారతి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. అయితే వారిది పేద కుటుంబం కావడంతో ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో జర్నలిస్టులు నారాయణ, ప్రకాష్, ప్రసాద్, రవూఫ్, మూర్తి, భాష తదితరులు బుధవారం రూ.15 వేల ఆర్థిక సాయం చేశారు.

విద్యార్థులకు బహుమతులు

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ఇన్‌చార్జ్ హెచ్ఎం నరసింహమూర్తి ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు.

అభివృద్ధి వైపు దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రకుమార్, చిత్రంలో ఎంపీపీ రత్నమ్మ, అధికారులు



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

హిందూపురం అర్బన్: అనుకున్న సమయానికే చర్చించిన పనులు పూర్తీ చేసి అభివృద్ధి వైపు ముందడుగు వేయాలని ఎంపీపీ రత్నమ్మ పేర్కొన్నారు. హిందూపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో బుధ వారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని.. పూలకుంట ఇందిరమ్మ కాలనీలో సమస్యను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గోళ్లాపురం గ్రామంలో మూడు విద్యుత్ పోల్స్ అవసరమని వైస్ ఎంపీపీ రామాంజనేయులు తెలుపగా ఏర్పాటు చేస్తామని సమాధానమిచ్చారు. తూమకుంట ఎంపీటీసీ షమీమ్ ఉన్నీసా ఎస్‌హెచ్ఈ భవనానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. మండల వ్యాప్తంగా 190 పాఠశాలల్లో 35 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని బడి బయట విద్యార్థులు లేకుండా చూస్తున్నామని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. గోళ్లాపురం పాఠశాల్లో ఉపాధ్యాయుల కొరతను విద్యాశాఖ అధికారి దృష్టికి సభ్యులు తీసుకెళ్లారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ సమస్య వచ్చినా అధికారులు, సభ్యులు తమ దృష్టికి తీసుకు వస్తే తక్షణం స్పందిస్తామని బసవనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు శ్రీదేవి స్పష్టం చేశారు. సీడీపీఓ రెడ్డి రమ్మణమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికారం అందిస్తున్నామని చెప్పారు. ప్రతి కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఏపీఓ అప్పల స్వామినాయుడు మాట్లాడుతూ మండలంలో 6096 జాబ్ కార్డులు ఉన్నాయని, 10,715 మంది కూలీలు ఇప్పటి వరకూ 45 వేల పనిదినాలు పూర్తి చేసుకున్నారన్నారు. ఇంకా 30 వేల పని దినాలు చేసే వీలుందన్నారు. మండలంలో 34 మంది రైతుల నుంచి 64 ఎకరాల్లో పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తులు స్వీకరించినట్లు ఉద్యానశాఖ అధికారులు సభ దృష్టికి తెచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో మండల వ్యాప్తంగా జలజీవన్ కింద 5 పనులు మంజూరు కాగా అందులో 4 పనులు ప్రారంభమయ్యాయని ఆశాఖ జేఈ దివ్య తెలిపారు. మండల వ్యాప్తంగా కొత్తగా మరుగుదొడ్లు నిర్మించుకొనే వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ నాగమణెమ్మ, వైస్ ఎంపీపీ నాగరాజిరెడ్డి, మండల ఎంపీటీసీలు, ఎంపీడీఓ నరేంద్ర కుమార్, అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు.

రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీరాములు



పెనుకొండ: రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాములు ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఎంపిక ప్రక్రియలో రాష్ట్ర నాయకులు శ్రీరాములును జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపిక చేశారు. శ్రీరాములు మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

రంగప్పకు సన్మానం

మడకశిర: మడకశిరలో బుధవారం గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రంగప్పను ఎమ్మెల్యే తిప్పేస్వామి సన్మానించారు. ఇటీవలనే రంగప్ప అగళి మండలంలోని పీ.బ్యాడిగెర గ్రామ పంచాయతీ రెండో వార్డు నుంచి వార్డు మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో అగళి మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన చంద్రమౌళి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ప్రధాన రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎల్లోటి గ్రామానికి చెందిన చంద్రమౌళి ద్విచక్ర వాహనంలో మడకశిర వైపు వస్తుండగా ప్రధాన రోడ్డుపై ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. స్థానికులు ఎస్ఐ లోకేష్ సమాచారం అందించడంతో వెంటనే ఎస్ఐ అక్కడికి చేరుకొని గాయపడిన వ్యక్తిని వాహనంలో మడకశిర ఆస్పత్రికి తరలించారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు

పరిగి: ప్రతిభకు వైకల్యం అడ్డు కాదని ఎంఈఓ లక్ష్మీదేవి తెలిపారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రముఖ సామాజిక సేవాకార్యకర్త బంగారు చంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు టేబుల్స్‌ను అందించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు మమత, ఫిజియోథెరపిస్టు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

హిందూపురం టౌన్: రైలు ప్రమాదంలో గాయపడి చేయి, కాలు కోల్పోయిన వికలాంగుడికి సహస్ర ప్రణామం అనాథశ్రమం నిర్వాహకులు అండగా నిలిచారు. బుధవారం లక్ష్మీపురంలోని వికలాంగుడు బాలాజీ ఇంటికి వెళ్లి ట్రై సైకిల్, వాకర్, మూత్ర విసర్జన కుర్చీని అందించారు. కార్యక్రమంలో అనాథాశ్రమం నిర్వాహకులు ఆదిత్య, రచయిత శివకుమార్, చంద్రాయుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, నగదుతో పోలీసులు

మడకశిర: మండలంలోని నీలకంఠాపురం వద్ద బుధవారం పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.28,290 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా ఎనిమిది ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.